రాష్ట్రాలు దాటివస్తున్న గంజాయి!

- నిత్యం తనిఖీలతో నిఘా పెంచిన పోలీసులు
- గంజాయి కేసులో పలువురు జైలుకు
- మత్తు పదార్థాలపై యువతకు అవగాహన



గంజాయి కేసులో అరెస్టు చేసిన వారిని, గంజాయిని చూపిస్తున్న పోలీసులు(ఫైల్)



వాహనాలను సోదా చేస్తున్న పోలీసులు(ఫైల్)

వాజేడు : రాష్ట్రాలు దాటి తెలంగాణలోకి గంజాయి వస్తుంది. పోలీసులు ఎక్కడికక్కడ నిఘాను పెట్టినప్పటికీ వారి కళ్లు కప్పి గంజాయిని కొందరు సమీప రాష్ట్రాల నుంచి తెస్తున్నారు. సమీప ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కొందరు గంజాయిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దానికి బానిసలైన కొందరు గంజాయిని సేవిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో యువత మత్తుకు బానిసై తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మత్తు పదార్థాలను అమ్మడం, సేవించడం వలన కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. కొందరు లాభాపేక్షతో ప్రజలకు గంజాయిని విక్రయిస్తూ పబ్బం గడుపుతుంటే దానిని సేవించిన వారు ప్రాణాల మీదకు తెచ్చుకోవడంతో పాటు కుటుంబాలను ఇబ్బందుల కు గురి చేస్తున్నారు. గంజాయి గురించి ఏ చిన్న సమాచారం వచ్చినా క్షణాల్లో దానిని పట్టుకోవడంతో పాటు దానిని తీసుకొస్తున్న, సేవిస్తున్న వారిని పట్టుకొని కేసులు నమోదు చేస్తూ జైలుకు పంపిస్తున్నారు.

నిఘా పెంచిన పోలీసులు

గంజాయి నిర్మూలనలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు ఎక్కడికక్కడ ప్రత్యేక నిఘాను పెంచారు. వాజేడు మండలంలో ఇప్పటికే గంజాయిపై పలు కేసులు నమోదయ్యాయి. ఆగస్టు 30న ఎస్సై జక్కుల సతీశ్ 163 నెంబర్ జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ద్విచక్ర వాహనాలపై తీసుకొస్తున్న రూ.15 లక్షల విలువ చేసే 30 కిలోల గంజాయిని పట్టుకోవడంతో పాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. జూలై 25న పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ టేకులగూడెం గ్రామ సమీపంలో గంజాయి సేవిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మత్తు పదార్థాలపై యువతకు అవగాహన

మత్తు పదార్థాలను అమ్మడం, సేవించడం నేరమని పోలీసులు ఇప్పటికే ప్రచారం చేయడంతో పాటు యువతకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. గ్రామ గ్రామాన యువతకు తమ బాధ్యతను తెలియ జేస్తూ చదువులపై ప్రత్యేక దృష్టిని నిలిపేలా అవగాహన కల్పిస్తున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న యువతకు క్రీడా వస్తువులను ఇస్తూ వ్యసనాలకు దూరంగా ఉండేలా చూస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ స్తంభంపై పిడుగు

ఏటూరునాగారం: మండలంలోని ఐటీఐ కళాశాల వెనుకాల కొమురం భీం నగర్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ స్తంభంపై పిడుగు పడింది. దీంతో విద్యుత్ లైట్లు, కరెంటు వైర్లు తెగిపడ్డాయి. స్తంభం పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో విద్యుత్ సరఫరా గంటపాటు నిలిచిపోయింది. సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ట్రాన్స్‌కో ఏఈ అశోక్, సిబ్బంది సత్వరమే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జాకారం గురుకుల సమీపంలో..

ములుగు రూరల్: ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపంలో నూతన పాలశీతలీకరణ కేంద్ర వద్ద పిడుగుపడింది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి సమయంలో ఎడతెరుపు లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గురుకుల పాఠశాలకు . పాలశీతలీకరణ కేంద్రానికి మధ్యలో పిడుగుపడడంతో చెట్ల తోడుకలు మాడిపోయాయి. శీతలీకరణ కేంద్రంలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. రాత్రి సమయం కావడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

కోతుల బీభత్సం..



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామాల్లో శుక్రవారం కోతులు బీభత్సం సృష్టించాయి. గ్రామానికి చెందిన రొడ్డ తిరుపతమ్మ ఇంటి పైన ఉన్న సిమెంట్ రేకులను పగల గొట్టి కింద పడేశాయి. దీంతో బాధితురాలు లబోదిబోమంటుంది. జగన్నాథపురం గ్రామంలో కోతులు ప్రతీ రోజు బీభత్సం సృష్టిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చేపలు పట్టే వలలను కట్టినా వాటిని చింపుకొని లోపలికి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిటీల ఎన్నిక



ములుగు రూరల్: ములుగు మండలంలోని బరిగలానిపల్లి, కొత్తూరు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీలను మండల అధ్యక్షురాలు గుంటోజు పావని ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. బరిగలానిపల్లి అధ్యక్షురాలిగా గాజరాజు పద్మ, కొత్తూరు అధ్యక్షురాలిగా వీరమనేని లక్ష్మీలను ఎనున్నకున్నారు. నాయకురాళ్లు పిట్టల రాధిక, అల్లూరి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్‌గా శివాజీ



ములుగు రూరల్: జిల్లా కేంద్రంలో దసరా సందర్భంగా ప్రతీ సంవత్సరం ధర్మా జాగరణ సమితి ఆధ్వర్యంలో రావణాసుర వధ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం ఉత్సవ కమిటీని శుక్రవారం నియమించారు. ధర్మా జాగరణ సమితి అధ్యక్షుడు గండ్రకోట కుమార్ ఆధ్వర్యంలో కమిటీ కన్వీనర్‌గా రసమల్ల శివాజీని, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం

రేగొండ: మండలంలోని నాగుర్లపల్లి గ్రామానికి చెందిన కుంట దేవేందర్ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో దేవేందర్ బాల్యమిత్రులతో పాటు, గ్రామస్తులు, బంధువులు, శ్రేయోభిలాషులు రూ.2.50 లక్షల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

పాలెం కాల్వను కొత్త చెరువుకు మళ్లించాలి

- కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి విక్రాంత్



పాలెం ప్రాజెక్టు కాల్వను పరిశీలిస్తున్న విక్రాంత్

వాజేడు : వెంకటాపురం(కె) మండలంలోని పాలెం ప్రాజెక్టు కాల్వను ఆరుగుంటపల్లి గ్రామం వద్ద ఉన్న కొత్త చెరువుకు మళ్లించాలని కాంగ్రెస్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు. శుక్రవారం సమీప రైతులతో కలిసి పాలెం వాగు ప్రాజెక్టు కాల్వను ఆరుగుంటపల్లి వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలెం కాల్వను ఇంకొంచెం పొడిగించి కొత్త చెరువుకు మళ్లించాలన్నారు. అలా చేస్తే మూడు గ్రామాల రైతులకు సంబధించిన 1000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయించాల్సిందిగా కోరుతామని తెలిపారు. ఆయన వెంట రమేశ్, గాంధీ, లక్ష్మణ్, నర్సయ్య, చందర్‌రావు, వేణు, శ్రీరాములు తదితరులున్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి



ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న రజనీకాంత్

చిట్యాల: కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల రజనీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏచూరి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ భూక్య నవీన్, కొముయ్య, సారయ్య, కల్పన, రాజ్‌కుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంచేందుకే క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

- సీఐ శ్రీనివాస్

ఏటూరునాగారం: విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకే క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు సీఐ శ్రీనివాస్, ఎంఈఓ మల్లయ్య, ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా క్రీడాపోటీలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అండర్ 14, 17 విద్యార్థులకు నిర్వహించారు. ఈ క్రీడలను వారు హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను కరచలనం చేస్తూ పరిచయం చేసుకోని మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అన్నారు. చదువులో ఉన్న ఒత్తిడిని క్రీడల ద్వారా తగ్గించుకోవచ్చు అన్నారు. విద్యార్థులు ప్రతి రోజు వ్యాయామం, యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, క్రీడల సెక్రటరీ రమేశ్, పీడీలు మున్వర్, పద్మశ్రీ, రవి, స్వరూప, పృధ్వి, గణేష్, వెంకటేష్ తోపాటు 200ల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఓఎస్‌ఎస్) ద్వారా 2025–26 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీరామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి చదవడానికి 2025 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు ఇంటర్ చదవడానికి కనీసం 15 సంవత్సరాలు నిండాలని తెలిపారు. పదో తరగతికి జనన ధ్రువీకరణ పత్రం, కులం రెసిడెన్షియల్ పత్రాలు సమర్పించాలని తెలిపారు. అలాగే ఇంటర్మీడయట్‌కు పదో తరగతి టీసీ, ఎస్ఎస్సీ మెమో సమర్పించాలన్నారు. పదో తరగతికి రూ.1150, ఇంటర్‌కు రూ. 1500 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తాడిచర్ల మండల పరిషత్ కార్యాలయం లేదా తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలోని స్కూల్ అసిస్టెంట్ వెంకట్‌ను సంప్రదించాలన్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి



మాట్లాడుతున్న రాజుయాదవ్

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని మల్లంపల్లి మండల బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు మొర్రి రాజుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజీపీఎస్సీ నిర్లక్ష్యం కారణంగా గ్రూప్–1 అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. పరీక్షల అవకతవకలపై సిట్టింగ్ జడ్జీతో విచారణ నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగులపై తప్పుడు కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గ్రూప్–1 పరీక్షలను రద్దు చేస్తు నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీదర సంతోష్, సురేష్, రాజ్‌కుమార్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మొగుళ్లపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ స్వప్న అన్నారు. మండలంలోని ఇస్సిపేట గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఇద్దరి రక్త నమూనా తీసి ల్యాబ్‌కు పంపినట్లు డాక్టర్ స్వప్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ భిక్షపతి, రజిత ఆశవర్కర్లు, పంచాయతీ కార్యిదర్శులు ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగొండ: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు లైన్‌మెన్ విజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు రావులపల్లి, గడిపల్లి, పెద్దంపల్లి గ్రామాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోతుల బెడదను నివారించాలి



ములుగు రూరల్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



వెంకటాపురం(కె)లో..

ములుగు రూరల్: ములుగు మండలంలో, మున్సిపాలిటీ పరిధిలో కోతల బెడదను నివారించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు రత్నం ప్రవీన్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో, మండలంలో కోతల బెడద తీవ్రంగా ఉందని అన్నారు. నాయకులు రవీందర్, రాజు, కోటయ్య, సద్దాంహుస్సెన్ సాంబయ్య తదితరులు ఉన్నారు.

కోతుల సమస్య పరిష్కరించాలి

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో కోతల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులకు వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కోతుల బెడద మూడు సంవత్సరాల నుంచి ఉందని అన్నారు. కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కోతుల సమస్యను పరిష్కరించేందుకు పంచాయతీ, అటవీశాఖ అధికారులు చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని కోతులను పట్టుకోని సమీప అటవీ ప్రాంతంలో వదిలి పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్ల నర్సింహచారి, కోగిల మాణిక్యం, కుర్సం మల్లయ్య, నాగేశ్వరావు, నగేష్, దామోదర్ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ప్రధానోపాధ్యాయుడు సోమారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గోవిందరావుపేట: జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం టీఎంఎఫ్ జిల్లా శాఖ, గణిత ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల విద్యాధికారి గొంది దివాకర్, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, ప్రధానోపాధ్యాయుడు సోమారెడ్డి, టీఎంఎఫ్ రాష్ట్ర సలహాదారుడు కందాల రామయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సైకం శ్రీనివాస్ రెడ్డి, బాబురావు, చంద్రారెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే జీతాలు ఇవ్వాలి



నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులు

వెంకటాపురం(కె): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లను పర్మనెంట్ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీనగరం బాలుర ఆశ్రమ పాఠశాల ఎదుట డైలీవేజ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీఓ నం .64ను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. పాత పద్ధతిలోనే జీతాలు ఇవ్వాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభావతి, ముత్తమ్మ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి ఫొటోగ్రఫీలో శ్రావణ్ ప్రతిభ

- మహాకుంభ్ కేటగిరిలో ప్రథమ బహుమతి



రూ. లక్ష నగదు అందుకుంటున్న శ్రావణ్

వెంకటాపురం(ఎం): ఫొటోగ్రఫీ రంగంలో తెలంగాణ గర్వపడేలా నిలుస్తూ మండలంలోని రామప్పకు చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ తడండ్ల శ్రావణ్ జాతీయస్థాయిలో ప్రథమ బహుమతిని అందుకున్నాడు. దేశవ్యాప్తంగా ఫొటోగ్రఫీ కళను ప్రోత్సహించడానికి, యువ ప్రతిభను వెలికి తీసేందుకు సీజీపీటీఐఏ రెండు దశాబ్దాలుగా ప్రతీ ఏటా విజయవంతంగా నిర్వహిస్తున్న ఇండియా ఇంటర్నేషనల్ ఫొటో, వీడియో ట్రేడ్ ఫెయిర్ నిర్వాహకులు ఈ ఏడాది గుజరాత్‌లోని మహాత్మామందిర్‌లో ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో శ్రావణ్ అత్యంత ప్రతిభను కనబరిచాడు. ఈ పోటీల్లో ప్రత్యేకంగా నిర్వహించిన 'మహాకుంభ్–2025' కేటగిరీలో దేశవ్యాప్తంగా వందలాది మంది ఫొటోగ్రాఫర్లు తీసిన అపూర్వ క్షణాల ఛాయాచిత్రాలు ఎంపికయ్యాయి. వాటిలో శ్రావణ్ తీసిన చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి న్యాయ నిర్ణేతలను(జ్యూరీస్) విశేషంగా ఆకట్టుకున్నాయి. గుజరాత్‌లోని గాంధీనగర్ వేదికపై శుక్రవారం శ్రావణ్‌కు రూ.లక్ష నగదు పురస్కారాన్ని అందజేశారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఫొటోగ్రాఫర్లు, నిపుణులు, జాతీయ మీడియా శ్రావణ్‌ను అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు 50కి పైగా అవార్డులు అందుకున్న శ్రావణ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. ఈ అవార్డు తెలంగాణకు మాత్రమే కాకుండా దేశంలోని అన్ని ఫొటోగ్రఫీ అభిమానులకు అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



టేకుమట్ల: రైతులకు నచ్చచెబుతున్న పోలీసులు



గర్మిళ్లపల్లికి వెళ్తున్న లారీని అడ్డుకున్న రైతులు



మొగుళ్లపల్లి: యూరియా కోసం చెప్పులను క్యూలో ఉంచిన రైతులు

మొగుళ్లపల్లి: రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. ఎక్కడ యూరియా ఇస్తే అక్కడికి వెళ్తున్నారు. శుక్రవారం మండలంలోని పర్లపల్లి రైతు వేదిక వద్ద యూరియా ఇస్తున్నారని తెలువడంతో ఉదయమే రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. నిలబడే ఓపిక లేక చెప్పులను వరుసలో పెట్టారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఆగ్రోస్–1, మండలంలోని గర్మిళ్లపల్లి శ్రీనివాస ఫర్టిలైజర్‌కి రెండు వందల యూరియా బస్తాల చొప్పున లారీ లోడ్‌లు వచ్చాయి. 200 మంది రైతులకు సగం లోడు యూరియా బస్తాలను ఆగ్రోస్ నిర్వాహకులు పంపిణీ చేశారు. మిగతా 200బస్తాల లోడుతో ఉన్న లారీ గర్మిళ్లపల్లి బయల్దేరే సమయంలో మొత్తం లోడును ఇక్కడే ఇవ్వాలని రైతులు ఆందోళనకు దిగారు. సీఐ మల్లేశ్‌యాదవ్, ఎస్సై సుధాకర్‌లు ఆగ్రోస్ కేంద్రానికి చేరుకుని మరో 50 మంది రైతులకు యూరియా బస్తాలను అందించి ఆందోళన సద్దుమణిగేలా చేశారు.

అధికం అనర్థమే!



వరి పొలంలో ఎరువు చల్లుతున్న రైతు

- మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్న రైతులు
- పంట దిగుబడిపై ప్రభావం

రేగొండ: పంటల సాగులో రైతన్నలు అధిక దిగుబడి వస్తుందనే ఆశతో రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తుంటారు. అయితే ఏదైనా అధికంగా వినియోగిస్తే అనర్థమే అని వ్యవసాయ నిపుణలు సూచిస్తున్నారు. వ్యవసాయంలో రోజు రోజుకు రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోతుంది. దీంతో నేల భూసారం తగ్గడంతో పాటు పంటల దిగుబడులపై కూడా ప్రభావం చూపి దిగుబడులు పెరగడానికి బదులు తగ్గి ఆర్థికంగా నష్టాలు తప్పవని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఏదైనా పరిమితంగా వాడితేనే ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

30 వేల ఎకరాల్లో పంటల సాగు

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో రేగొండ మండల వ్యాప్తంగా 9,800 ఎకరాల్లో పత్తి, 7,550 ఎకరాల్లో వరి సాగు, కొత్తపల్లిగోరి మండల వ్యాప్తంగా 5,420 ఎకరాల్లో పత్తి, 5,670 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఏటా విత్తనం వేసిన నాటి నుంచి దిగుబడి వచ్చే వరకు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నారు. తద్వార పంట పొలాల్లో భాస్వరం నిల్వలు పేరుకుపోతున్నాయి. సూక్ష్మపోషకాలు తగ్గిపోతున్నాయి. పొంచి ఉన్న ముప్పును నివారించేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అవసరం మేరకే వాడాలి

మండలంలోని ఆయా గ్రామాల్లో గత సీజన్‌లో ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడడం ద్వారా పత్తి, వరి పంటల దిగుబడులు తగ్గాయి. పంటల సాగుకు అవసరం ఉన్న మేరకు ఎరువులు వాడాలని అధికారులు చెబుతున్నారు. వరి సాగులో పిలకలు వేసే సమయంలో ఎకరాకు డీఏపీ 50 కిలోలు, చిరు పొట్ట దశలో 25 కిలోల పొటాష్, పత్తి సాగులో డీఏపీ 50 కిలోలు, పూత, కాత సమయంలో 25 కిలోల యూరియా, కాయల సమయంలో 15 కిలోల పొటాష్ వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

నానో యూరియా వాడాలి



రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేలలో భూసారం తగ్గి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ప్రస్తుతం యూరియా కోసం గంటలు గంటలు లైన్లో నిలబడి తీసుకెళ్లడానికి బదులు నానో యూరియా వినియోగిస్తే పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

– పెద్ది వాసుదేవారెడ్డి, ఏఓ, రేగొండ

బురదమయంగా కళాశాల ప్రాంగణం



బురదమయంగా ఉన్న కళాశాల ఆవరణం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం చిరు వర్షాలకే నీరు నిల్వ ఉండి బురదమయంగా మారుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు అన్నారు. శుక్రవారం కాలేజీని ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల ప్రాగణం మొత్తం నీరు నిల్వ ఉండి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.